క్లుప్తంగా

చర్యలు తీసుకోవాలి


సీఐకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భైంసాటౌన్: అంబేద్కర్‌పై సోషల్ మీడియాలో అనుచిత వాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం భైంసాలో సీఐ శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓ వ్యక్తి అంబేద్కర్‌ను దేశద్రోహి అంటూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారని.. అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శంకర్ చంద్రే, గౌతంపింగ్లే, రాజు, భీంరావు డోంగ్రే, శ్రీనివాస్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ముధోల్: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సాయికిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని నాయాబాదీ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ వాహనాదారులు అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో అపరిచితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

హనుమాన్ విజయయాత్ర ర్యాలీ


పూజలు చేస్తున్న యువకులు

తానూరు: మండల కేంద్రంలో ఆదివారం భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ విజయ యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మహారాష్ట్రలోని పరభణి నుంచి వచ్చిన భజన మండలి సభ్యులు భజనలు చేస్తూ వీధుల్లో ర్యాలీ తీశారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో గ్రామంలోని సాయిబాబా ఆలయం వద్ద హనుమాన్ ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కేంద్రం నుంచి వచ్చిన భజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాల్వ దెబ్బతినడంతో నష్టపోయిన రైతులు

ఖానాపూర్: ఖరీఫ్‌లో అధిక వర్షాలకు తోడు పాతఎల్లాపూర్‌లో కాలువ దెబ్బతిని సదర్‌మాట్ ఆనకట్ట పరిధిలోని చివరి ఆయకట్టు రైతులు నష్టపోయారని గిరిజన శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సిద్ధార్థనాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సదర్‌మాట్ ఆనకట్ట పరిధిలో కడెం, దస్తురాబాద్ మండలాల చివరి ఆయకట్టు రైతుల కష్టాలను పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. పంటలు ఎండిపోయి రైతులకు నష్టం వాటిల్లితే ప్రభుత్వమే పరిహారం చెల్లించాలన్నారు. లేకుంటే రైతుల పక్షాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మరాఠ సంఘం ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న నాయకులు

కుభీర్: మండలంలోని పాంగ్ర గ్రామంలో మరాఠ తాలుకా సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా సమ్మేళనంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు జేకే పటేల్ మాట్లాడారు. ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకొని సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామంలో మరాఠ సంఘాలు చేర్పాటు చేయాలన్నారు. అనంతరం సమస్యలు చర్చించారు. సమ్మేళనంలో సంఘం తాలుకా అధ్యక్షులు పండలిక్‌రావ్, కార్యదర్శి విఠల్‌రావుపటేల్, రఘువీర్ పటేల్, దత్తాహరి పటేల్, దిగంబర్, బాలాజీ పాల్గొన్నారు.

మున్నూరుకాపులు ఐక్యంగా ఉండాలి


మాట్లాడుతున్న రమేశ్

తానూరు: మున్నూరుకాపులు ఐక్యంగా ఉండి ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆ సంఘం తాలూక అధ్యక్షుడు రోళ్ల రమేశ్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో మున్నూరుకాపు కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. మండలాధ్యక్షుడు పోశెట్టి, ప్రధాన కార్యదర్శి సంతోష్, సర్పంచ్ విఠల్, పుండలిక్, రాజు, సురేశ్, గణేశ్, బాబాసాయి, యోగేశ్ పాల్గొన్నారు.

పట్టణంలో ప్లాస్టిక్ భూతం!


ప్రియదర్శినినగర్ కాలనీ వద్ద కందకంలో నిండిపోయిన ప్లాస్టిక్


మార్కెట్‌లో కవర్‌లో కూరగాయలు తీసుకెళ్తూ..

- పెరిగిన కవర్ల విక్రయం, వినియోగం
- తనిఖీలు మరిచిన అధికారులు
- నిర్మల్‌లో యథేచ్ఛగా వాడకం
- ప్రజలకు పొంచి ఉన్న ముప్పు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ప్లాస్టిక్‌భూతం భయపెడుతోంది. మున్సిపాలిటీలో నిషేధిత సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. 120 మైక్రాన్లలోపు మందం కలిగిన కవర్లు, గ్లాసుల నిషేధం అమల్లోకి నోచుకోవడం లేదు. పలు మద్యం షాపుల వద్ద ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు ఇష్టానుసారం పడేస్తున్నారు. వ్యాపారులు సైతం ప్రభుత్వం నిషేధించిన తక్కువ మైక్రాన్లు కల్గిన ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తూ లాభాలు దండుకుంటూ ప్రజా రోగ్యానికి చేటు చేస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ఉక్కుపాదం మోపాల్సిన మున్సిపల్ అధికారులు నామమాత్రంగా సోదాలు, కేసులతో తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

కర్రీపాయింట్లు, హోటళ్లలోనే ఎక్కువ వినియోగం..

కర్రీపాయింట్, హోటళ్లలో తక్కువ మైక్రాన్ల లోపున్న ప్లాస్టిక్ కవర్లు, పేపర్లను ఉపయోగిస్తున్నారు. స్వీట్ షాపులు, పండ్ల దుకాణాలు, ఫ్యాన్సీ, కిరాణా దుకాణాల్లో సైతం తక్కువ మైక్రాన్లు కల్గిన కవర్లను వాడుతున్నారు. వివాహాది శుభకార్యాల్లో ప్లాస్టిక్ వస్తువులనే ఉపయోగిస్తున్నారు. వేడి వస్తువులు తక్కువ మైక్రాన్లు కల్గిన కవర్లపై పడినప్పుడు ఆహారంలో ప్లాస్టిక్ కరిగి కలిసిపోతుంది. దీంతో ప్రజలు క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కందకాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ కుప్పలు..


ఈద్‌గాం చౌరస్తా వద్ద వైన్సు సమీపంలో..

జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో ఉన్న కందకాలు పూర్తిగా ప్లాస్టిక్ కుప్పలతో నిండిపోయాయి. దీంతో దోమలు వద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చెరువుల్లోనూ విపరీతంగా ప్లాస్టిక్ పడేస్తున్నారు. కాలనీల్లో రోడ్లకు ఇరువైపులా ఎక్కడ చూసినా వాడి పడేసిన ప్లాస్టిక్ కనిపిస్తుంది. వీధి వ్యాపారస్తులు ఎక్కువగా ప్లాస్టిక్ వినియోగిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

ప్రభుత్వం 2022 జూలై ఒకటి నుంచే ప్లాస్టిక్ వస్తువుల నిషేధాన్ని అమల్లోకి తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాని ఈ నిబంధనలను అటు వ్యాపారులు, ఇటు ప్రజలు, అధికారులు అమలు చేయడం లేదు. కొత్తలో మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలపై అవగాహన కల్పించి తనిఖీలు చేశారు. దీంతో కొంతకాలం పాటు ప్లాస్టిక్ వినియోగం తగ్గింది. తర్వాత అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరించడంతో వ్యాపారులు ఆ కవర్లను యథేచ్ఛగా అమ్ముతున్నారు.

మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి



జిల్లా కేంద్రంలో వాడే ప్లాస్టిక్‌పై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. కాలనీల్లో ఉన్న కందకాల్లో ప్లాస్టిక్ పడేయడంతో దోమలు పెరిగి పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే భవిష్యత్తులో ప్రమాదం ఎదుర్కోవాల్సి వస్తోంది.
– సంపత్‌కుమార్, వ్యాపారి(మంజులాపూర్)

బయోగ్రేడ్ కవర్లను వాడాలి



జిల్లా కేంద్రంలో తయారు చేసే బయోగ్రేడ్ కవర్లనే వ్యాపారులు వినియోగించాలి. తక్కువ మైక్రాన్లు ఉండే ప్లాస్టిక్ వాడే వ్యాపారులకు జరిమానాలు విధిస్తాం. నిబంధనలు ఉల్లంఘిస్తే, దుకాణాల లైసెన్సు రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
– ఏవీఎన్ రాజు, మున్సిపల్ కమిషనర్

రంజాన్ కానుకలు పంపిణీ


భైంసాలో కానుకలు ఇస్తున్న నాయకులు


అందకూర్‌లో పంపిణీ చేస్తున్న నాయకులు

భైంసాటౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో ప్రభుత్వం సమకూర్చిన రంజాన్ కానుకలను బీఆర్‌ఎస్ నాయకులు ముస్లింలకు పంపిణీ చేశారు. పదో వార్డులో తోట రాము ఆధ్వర్యంలో రంజాన్ కిట్లు అందజేయగా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ రుక్మిణీ మురళీగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్ మాశెట్టివార్ ఆధ్వర్యంలో కానుకలు అందించారు.

అందకూర్‌లో..

కుంటాల: మండలంలోని అందకూర్ గ్రామంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం అందించిన రంజాన్ కానుకలను ముస్లింలకు పంపిణీ చేశారు ప్రజాప్రతినిధులు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి కిషన్, ఎంపీటీసీ మధుకర్, బీఆర్‌ఎస్ నాయకులు కమలాకర్, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో పంటలకు నీళ్లు

- హర్షం వ్యక్తం చేసిన చాక్‌పల్లి అనుబంధ గ్రామాల రైతులు


వదులుతున్న నీటి వద్ద రైతుల సందడి

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి అనుబంధ గ్రామాలైన పాతడొంగుర్గాం, కొత్త డొంగుర్గాం, చాక్‌పల్లి, అర్లి(కె) గ్రామాల రైతులు ఇటీవల ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కలిసి పంటలు చివరి దశలో ఉన్నాయని.. సాగునీరు అందించి సమస్య పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, చాక్‌పల్లి మాజీ సర్పంచ్ ఖదీర్, బీఆర్‌ఎస్ నాయకులు జంగిపల్లి సంతోశ్ పటేల్ సహకారంతో డొంగుర్గాం ఎత్తిపోతల పథకం ద్వారా తాత్కాలికంగా డీజిల్ ఇంజన్లతో నీళ్లను లిఫ్ట్ చేసి సుమారు 300 ఎకరాల వరి, 100 ఎకరాల మొక్కజొన్న పంటలకు నీరు అందించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా ప్రవేశపరీక్ష


సోన్: పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న అధికారి


కుంటాల: పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

సోన్: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ టీఎస్ డబ్ల్యూఆర్‌ఎస్ బాలికల పాఠశాలలో 7, 8, 9వ తరగతుల్లో ప్రవేశం కోసం 536 మంది దరఖాస్తు చేసుకోగా 423మంది ప్రవేశపరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ సరస్వతి తెలిపారు. కేంద్రాన్ని రీజనల్ కోఆర్డినేటర్ మేరి యేసుపాదం పరిశీలించారు.

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు సీట్ల ఖాళీల కోసం నిర్వహించిన ప్రవేశపరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఆరో తరగతి ప్రవేశపరీక్షకు 445మంది విద్యార్థులకుగాను 103 మంది గైరాజరైనట్లు ఎంఈఓ ముత్యం, చీఫ్ సూపరింటెండెంట్ కిషన్‌రావు, డీఓ రమణారావు తెలిపారు. మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు ఏడు, ఎనిమిది, తొమ్మిదో తరగతి సీట్ల ఖాళీల కోసం 343మంది విద్యార్థులకు గాను 99 మంది గైరాజరైనట్లు వారు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాన్ని ఎస్సై హన్మాండ్లు తనిఖీ చేశారు.

కోతుల నియంత్రణకు ప్రయత్నం

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో కోతుల బెడద పెరగడంతో ఆదివారం గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. మాస్కులు ధరించి గ్రామంలోని వీధుల్లో పెద్ద శబ్దాలు చేస్తూ కోతులను గ్రామంలో నుంచి అటవీ ప్రాంతానికి వెల్లగొట్టారు. కోతుల సమస్య పరిష్కారమయ్యే వరకు ఇలానే చేయాలని గ్రామస్తులు నిర్ణయించారు. సర్పంచ్, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

భైంసాటౌన్: పట్టణంలో తాగునీటి సరఫరాలో సోమవారం అంతరాయం ఏర్పడనున్నట్లు మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలో నీటి సరఫరా నిలిపివేస్తామన్నారు. పట్టణవాసులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కుంటాల: మండలంలోని కల్లూరు నుంచి నర్సాపూర్(జి) మండలం గొల్లమాడ 33/11కేవీ మరమ్మతుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కుంటాల, గొల్లమాడ సబ్‌స్టేషన్ పరిధిలోని గృహ, వ్యవసాయ రంగాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మున్సిపల్ గదులకు వేలం

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలోని 26 గదులకు సోమవారం బహిరంగ వేలం ఉంటుందని కమిషనర్ రత్నాకర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం 11 గంటల్లోపు రూ. లక్ష డీడీని కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు కానుకలు పంపిణీ

ఖానాపూర్: రంజాన్ పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే రేఖానాయక్ సోమవారం ముస్లింలకు కానుకలు పంపిణీ చేస్తారని తహసీల్దార్ రాజమోహన్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పట్టణంతోపాటు ఆయా గ్రామాలకు చెందిన ముస్లింలకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఉంటుందన్నారు.

వైద్యశిబిరం

కుంటాల: మండలంలోని విట్టాపూర్ గ్రామంలో ఆదివారం భైంసా శ్రీ లక్ష్మి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ లక్ష్మి, ఉపసర్పంచ్ నవీన్‌రెడ్డి, వైద్యులు హర్ష, అజయ్‌కుమార్, నిర్వాహకుడు శేఖర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు


అవగాహన కల్పిస్తున్న చరణ్‌కుమార్

భైంసాటౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని సినిమా థియేటర్‌తో పాటు పెట్రోల్‌పంపులు, ఆస్పత్రుల ఆవరణలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ఏర్పాట్లు చేసుకోవడంతోపాటు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని అగ్నిమాపక అధికారి చరణ్‌కుమార్ పేర్కొన్నారు. అనంతరం అగ్ని ప్రమాదాలు సంభవిస్తే చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. నడిరోడ్డుపై మురికి నీరు



లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో పొటెపల్లికి వెళ్లే మార్గంలో డ్రైయినేజీ లేకపోవడంతో మురుగునీరంతా రోడ్డుపై నిలుస్తోంది. దీంతో పెద్ద గుంత ఏర్పడటంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు మురికి కాలువ నిర్మించి రోడ్డుపైకి మురికి నీరు రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.
ప్రశ్నించాల్సిన అధికారి: రఘువంశీ, పీఆర్ ఏఈ, లోకేశ్వరం, ఫోన్: 95506 07360

'ఏలేటి'ని కలిసిన బీజేపీ నాయకులు


పుష్పగుచ్ఛం అందిస్తున్న బీజేపీ నాయకులు

లక్ష్మణచాంద: ఇటీవల బీజేపీలో చేరిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆ పార్టీ లక్ష్మణచాంద మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఇందులో బీజేపీ మండలాధ్యక్షుడు గోవర్దన్, ఉపాధ్యక్షుడు రంజిత్, ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు రాపని గంగాధర్, ఉపాధ్యక్షుడు నాగుల రాజు, మోహన్ తదితరులు ఉన్నారు.

బూత్ స్వశక్తికరణ్ జయప్రదం చేయాలి

ఖానాపూర్: మండలంలోని అన్ని బూత్‌ల పరిధిలో బూత్ స్వశక్తికరణ్ అభియాన్ జయప్రదం చేయాలని బీజేపీ మండల అధ్యక్షులు టేకు ప్రకాశ్ కోరారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇప్పటివరకు 90 శాతం పన్నాకమిటీలు పూర్తయ్యాయని.. మిగతా చోట్ల సోమవారం పూర్తి చేయాలని కోరారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	50
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : దసరా
నారాయణ: శాకుంతలం

భైంసా ఏఎంసీ నూతన పాలకవర్గం

- చైర్మన్‌గా రాజేశ్‌బాబు
- వైస్‌చైర్మన్‌గా సుదర్శన్‌పటేల్, ఇతర సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు


రాజేశ్‌బాబు


కె.సుదర్శన్‌పటేల్

భైంసాటౌన్: భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు అందినట్లు ఏఎంసీ కార్యదర్శి అడెల్లు తెలిపారు. ఏఎంసీ చైర్మన్‌గా రాజేశ్‌బాబు, వైస్ చైర్మన్‌గా కె.సుదర్శన్‌పటేల్‌తోపాటు 16 మంది సభ్యులను నియమిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. డిసెంబర్‌లో పాలకవర్గం గడువు తీరడంతో దాదాపు మూడున్నర నెలలుగా మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం నియామకం ఎప్పుడనే చర్చ కొనసాగింది. చైర్మన్‌గా ముందు నుంచి రాజేశ్‌బాబు పేరు వినిపించగా, వైస్ చైర్మన్ రేసులో బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి తోట రాము ఉన్నారు. అలాగే పట్టణానికి చెందిన కె.సుదర్శన్‌పటేల్(జేకే పటేల్) సైతం వైస్ చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు ఆయనను వైస్‌చైర్మన్ పదవి వరించింది.

ప్రతిష్ఠాపన విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

నిర్మల్‌టౌన్: విశ్వకర్మ ఉద్యోగ సంక్షేమ సంఘం, విశ్వకర్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మే 22న నిర్వహించే శ్రీ ముద్విరాట్ విశ్వకర్మ భగవాన్ శిలా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేవా జిల్లా అధ్యక్షుడు గాంధారి ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, విశిష్ట అతిథిగా ఎమ్మెల్సీ మధుసుదనాచారి హాజరవుతారని తెలిపారు. వేవా ఉద్యోగులు హాజరవాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి పూర్ణచందర్, కోశాధికారి శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు కోటగిరి అశోక్, పలు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలోని ఓంకారేశ్వర ఆలయ 14వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అర్చకులు హరీశ్‌కుమారచారి బృందం ఆధ్వర్యంలో మంగళతోరణం, మహారుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పపూజ, మహానైవేద్యం, మహాగణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, అంకురార్పణ, అఖండస్థాపన, సర్వతోభద్రమండల హవనం, అగ్నిప్రతిష్ఠ, అష్టదిక్పాలక, రుద్ర, మహా సుదర్శనహవనం, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమంతోపాటు పార్వతిపరమేశ్వరుల పల్లకిసేవ మహోత్సవం చేపట్టారు. గంగరాజం, పెద్దినర్సయ్య, రాజేందర్, శ్రీనివాస్, గుండేటి హన్మంతు, నాగేశ్, రమేశ్, మహేశ్, వెంకటేశ్, నర్సయ్య ఉన్నారు.